# జోడు బతుకు..!

ఒక బిడ్డకు తల్లి అయినా.. నన్ను సూడంగనే అప్పయ్యా..! అని పిల్సుకుంట, చిన్న పిల్ల లెక్క ఉర్కుంటచ్చి కావలిచ్చుకున్నది కమల. శాన దూరంల ఉన్న నా బిడ్డ యాదికచ్చి పానమంత కమల నా మీద పేమ తొౌటి గట్ల పిల్తది గాని నేనామె సుట్టాన్ని కాదు. 'ఎన్ని రోజులయ్యింది అప్పయ్యా నిన్ను సూసీ' అన్కుంట నా భుజంమీద తల్కాయె పెట్టి కంట్లె నీళ్ళు తీసుకున్నది. నాకండ్లల్ల సుత నీల్లూరబట్టనై. అవి యాతన తోటి వత్తానయో..! లేక సంబరమెక్కువై వత్తానయో..! తెల్వక జరంత సేపు తకమికపడ్డ. ఔ.. శానారోజులైంది. కమస్కం దస్ సాల్ దాటిందనుకుంట. నేను కండ్లు తుడ్సుకొని కమల ఈపు మీద పేమగ నిమురుకుంట ఓదార్సిన.కమల కడకొంగు తోటి కండ్లు ఒత్తుకున్నది. నా చెయ్యి పట్టుకొని ఇంట్లకు తీస్క పోయింది. నన్ను కుర్సిల కూకోబెట్టి తను మోకాల్ల మీద ముందల కూకున్నది. నా రెండు చేతులను తన చేతుల్లకు తీసుకుని కండ్లకద్దుకున్నది. లోగడ గిట్లనే అద్దుకొని.. నా ఎద మీద మాసి పోని ముద్దరేసింది. ఆనాటి సంగతులన్ని యాదికి రాబట్టినై.

--- --- ---

ఆయ్యాల్ల ఐతారం. పొద్దుగాల్నే ముందు కమల తట్టు కుర్సిల కూకోని పేపరు సదువుతాన. ఎవలో గేటు తీసిన సప్పుడైంది. పేపరు చిన్న టూలు మీద పడేసి పెద్ద దర్వాజ పక్కకున్న కిటికీలకెల్లి సూసిన. ఎవలో ఇద్దరు వత్తాండ్లు. బెల్లు కొట్టిండ్లు. పెద్ద దర్వాజ కట్క తీసి తెర్సిన. సార్.. 'టు లెట్' (కిరాయకి ఇవ్వబడును) బోర్డు చూసి వచ్చినం అన్నడు చేతులు కట్టుకొని.నేను కన్నద్దాలు సదురుకుంట కిందికెల్లి మీద్దాక సూసిన. బహూసా ఇరువై యేండ్ల పై చిలుకే ఉంటయనుకుంట. అతని ఎన్కాల ఒక పడుచు పొల్ల నిలబడ్డది. ఎవలెవలుంటరు అనుమానంగ అడిగిన.'మేమిద్దరమే సార్. నా పేరు ఆదిరెడ్డీ. ఈమె నా సోపతిరాలు కమల" నీ పెండ్లాం కాదా..! కావాలనే అడిగిన. సూడబోతే పెండ్లయిన పొల్ల లెక్క కనబడ్త లేదు. పెద్ద బల్లె సదువుకునే పిల్ల లెక్క కనబడ్తాంది. 'కాదు సార్.. దోస్త్ మాత్రమే.. మా సదువులింకా పూర్తి కాలేదు.. తమ ఇంటర్ పాసైంది.. డాకుటారు కోర్సుల సీటు కోసరం తయారైతాంది.. నేను వకీలు కోర్సు సదువుతాన మొదటి యాడాది పూర్తైంది"మీ ఇద్దరి సదువులూ ఒకటి కాదాయే. అయినా గిట్ల కలిసి ఒక ఇంట్లనే కిరాయకుండుడూ..' నా మాటలు పురంగ గాకముందే ఆదిరెడ్డి వాల్ల కత సెప్పుడు షురు సేసిండు. 'సార్.. కమల వాల్లు శాన బీదోల్లు. వీల్ల నాయ్న బల్లె చప్రాసి. అవ్వ ఇంట్ల పని, వంట పని సూసుకుంటది. కమలకింకా ఇద్దరు చెల్లెండ్లున్నరు ...'గట్ల నిలబడి చెప్తాంటే ఇనుడు మర్యాద గాదని ఇంట్లకు పిల్సి సోపల కూకోమన్న. వాల్ల కెదురుంగ నాతట్టు కుర్సీల నేను కూకున్న. ఆదిరెడ్డి, కమల నాకు దండం పెట్టుకుంట కూకున్నరు.'కమల నాయ్న దినాం తాగంది ఉండడు. కమలను సదివిచ్చుడు ఇక నావల్ల కాదని మొండికేసి కూకున్నడు. కమల, నేను చిన్నప్పటి సంది ఒక్క బల్లెనే సదువుకున్నం. కమల శాన తెలివిగల్లది. ఇంటర్ల ఫస్టచ్చింది. అసోంటి సదువుల తల్లి సదువు అంతటి తోటి ఆగిపోవద్దనుకున్న. నేను డాకుటారి కోర్సు సదివిత్తనని.. వాళ్ళింట్ల నచ్చజెప్పి, ఒప్పించి తీసుకచ్చిన. దయ సూపుండ్లి. మీరు ఇల్లు కిరాయికిత్తే.."ఆమెను హాట్టల్లుంచి సదివిత్తేంది' అన్కుంట.. కాల్ల సప్పుడు ఇని ఎన్కకు తిరిగి సూసిన. నా పెండ్లాం రాంబాయి పిల్లి లెక్క వత్తాంది. ఆదిరెడ్డి, కమల లేసి రాంబాయికి దండం పెట్టి కూకున్నరు. ఆదిరెడ్డి మల్ల చెప్పబట్టిండు.'సార్.. కమలకు, నాకు

హోట్టలు భోజనం పడది. ఇద్దరం కల్సి వంట చేసుకుంటం. అందుకే చిన్న పోర్షన్ కోసం గాలిత్తానం. కమల మొదటి తడవ పరీచ్చ రాత్తే సీటు రాలేదు. కోచింగ్ ఇప్పియ్యాలని సిటీకి తీసుకచ్చిన సార్'కాకి లెక్క రివ్వున మా ముందర వాలింది రాంబాయి.'బలే కతలు చెప్తున్నావ్ బాబూ.. నువ్వేవ్వరో తెల్వదు గాని.. ఇక దయచేయుండ్లి. ఎన్కట గిసోంటి దాన్ని ఉంచుకున్న ఆడది అనేటోల్లు. ఇప్పుడేమో.. దానికి సక్కంగ ఒక పేరు తగిలిచ్చిండ్లు. ఏందయ్యా అదీ..' అని మూతి మూరెడు సాపింది రాంబాయి.

'జోదు బతుకు (సహజీవనం)' అని అందిచ్చిన. 'ఆ..జోదు బతుకు..! అదేం బతుకు రోత బతుకు 'అని ఎక్కిరిచ్చుకుంట మూతి మూడు వంకర్లు తిప్పింది. తన ఎదలోని ఎత తన్నుకచ్చిందనుకుంట..! మొకాన్ని చేతులతోటి కప్పుకొని భోరుమన్నది కమల.. కంట్లె నీల్లు అర చేతుల కిందికెల్లి కారబట్టినై. అది సూడంగనే నా మన్సు కలి, కలయ్యింది.'అందరి ఆడోల్లకున్నదిదే మాయ రోగం. ఏడ్సి సాధిత్తరు..' అన్నది రాంబాయి.నాకు కిందికెల్లి కాల్సుకచ్చింది. సుర్రు, సుర్రుమని రాంబాయిని ఒక సూపు సూసిన. 'మనమిప్పుడు సేసేది జోదు బతుకే కదా..!' అన్నట్టు. నా సూపును తట్టుకోలేక ఇల్లు మాత్రం కిరాయకియ్యద్దన్నట్టు సైగలు సేసుకుంట కుక్కర్ పిలుత్తాంటే.. వంటింట్లకుర్కింది. కమల లేసి నా రెండు చేతులు పట్టుకుని తన కండ్లకద్దుకున్నది. ఆమె తడి కండ్లు మాకు బిచ్చం పెట్టుమన్నట్టు తగిలినై.'అప్పయ్యా.. నేను నీ బిడ్డసోంటి దాన్ని' అన్కుంట మొక్కింది. డాకుటరమ్మ కావాలనే నా పట్టుదల తెలుసుకొని ఆదిరెడ్డి నాకు అండగా నిలుత్తనని మాటిచ్చిండు. మా నాయ్నకు 'ఉన్న నాడు ఉట్ల పండుగ. లేన్నాడు లొట్ల పండుగ' అన్నట్టు కాపాయము లేదు. ముందు సూపూ లేదు. ఐదేళ్ళు నోట్లెకు పోవుడే కట్టంగ ఉన్నది. ఇక నన్నేం సదివిత్తరని ఆదిరెడ్డిని నమ్మి వచ్చిన. నేను అనుకున్నది సాదిత్తే గాని పెల్లి సంగతి ఆలోసన చెయ్య. అప్పటి పరితితులను బట్టి బహుసః మేము పెండ్లి సుత సేసుకుంటామేమో..!. అందాక మేము.. మీరన్నట్లు సోపతి బతుకు అదే జోదు బతుకు బతుకుతం. ఇద్దరు మొగోల్లు లేదా ఇద్దరాడోల్లు ఒక ఇంట్ల కలిసి వుండి సదువుకునుడు తప్పులేనిది.. ఒక ఆడ, ఒక మగ కలిసి వుండి సదువుకుంటే తప్పేంది అప్పయ్యా..! లోకం తప్పు బట్టకుంట మసులుకుంటం. గిట్ల బతుకుడు తప్పుకాదని సూపిత్తం అని సవాలు చేత్తానట్టు సెప్పింది.నేను విస్తుపోయిన.. ఆమె చలాకితనానికి, దూర సూపుకు ముద్దచ్చింది.

ఈ సందుల్నే నేను వజీఫా (పదవీ విరమణ) తీసుకున్న.. ఆ నాటి సంది నా రాంబాయి ఎన్కట సీన్మలల్ల సూర్యకాంతం లెక్క తయారైంది. ఆమె మాటే వేదవాక్కు. నా కొడుకు, బిడ్డ సుత ఆమెకే ఓటేత్తరు. ఆమె తీసుకునే నిర్నయాలు నాకు నచ్చక అవ్వాల నిల దీసి అడిగిన. రాంబాయి కండ్లు తాటికాయలంత సేసుకొని నా మీద ఇర్సుక పడ్డది. ఎన్నడూ పల్లెత్తు మాట అనని నేను ఈడ్చి చెంప మీద కొట్టిన. అర సెనంల పసువు లెక్క మారిన నామీద నాకే రోతపుట్టుకచ్చింది.

రాంబాయి నాకు చెప్పా చెయ్యకుంట తన తల్లిగారింటికి పోయింది. చెయ్యి చేసుకున్న సంగతి మా పిలగాండ్లకెరుకైంది. నాతోని మాట్లాడ్డు బందు పెట్టిండ్లు. నేను ఏకాకినైన. నేను చేసింది శాన తప్పని పచ్చాయించిన. రాంబాయి నాతోని మాట్లడకున్నా ఫరవాలేదు గాని నాకెదురుంగ కనబడితే సాలని నా మన్సు కొట్టుకోబట్టింది. నాకు నాయ్న, అవ్వ లేరు. తోడబుట్టినోల్లూ లేరు.. సోపతిగాండ్లతోటి చెప్పుకునేది కాదాయే..! కదరు తక్కువ. నా బాధ ఎవరితోని పంచుకోను.. సెనం, సెనం చచ్చి బతుకబట్టిన. కమస్కం ఏక్ మైనా దాటిందనుకుంట.. రాంబాయి ఇంట్ల కాలు పెట్టింది. ఆ కాలును అట్లనే పట్టుకున్న. నన్ను సెమించుమని బతిలాడిన.సాల్లే సంబురం.. అని ఈసడిచ్చుకుంట సూసింది. కండ్లల్ల కండ్లు పెట్టి సూత్తే, మల్ల ఆమె సూపు

నన్నేడ పసువును సేత్తదో అని తల్కాయె న్యాలకేసుకున్న. నా చెయ్యి కింద కాలు ఎన్కకు గుంజుకొని సర్ర సర్ర తాసుపాము లెక్కబుస కొట్టుకుంట ఇంట్లకు పోయింది. రాంబాయి నా ఎదురుంగ కనబడ్తే సాలని నా మన్సుకు నేనే సముదాయించుకున్న. ఒక్క ఇంట్లనే.. నాత్రి పూట చెరొక కమ్రల నీల్గుతానంఇదీ ఇప్పటి మాబతుకు మలిదశ.. జోడు బతుకన్నట్లే కదా..! అని నా మనాదిలకు రాంగనే రాంబాయి మాటను లెక్క సెయ్యకుంట.. ఆమె మీద పగ తీర్సుకుంటాన అనే తుర్తి తోటి ఆదిరెడ్డి, కమలకు ఇల్లు కిరాయకిచ్చిన.

--- --- ---

వారం తిరిగింది.. ఆదిరెడ్డి, కమల వాల్ల జోడు బతుకు సూడాలని బుద్ధిపుట్టింది. అ యాల్ల నాత్రి ఎనిమిదింటికి పత్తేదారు లెక్క పోయి వాల్ల తలుపు కొట్టిన. ఎంటనే తలుపు తెర్సుకోలేదు. అనుమానపడ్డ. మల్లోసారి తలుపు లాసిగ కొట్టిన. 'సారీ అప్పయ్యా. ఆదిరెడ్డికి బువ్వ వడ్డిత్తాన.. బేగి రాలేకపోయిన' అన్నది కమల. ఎంగిలి చెయ్యి ఎన్కకు పెట్టుకుంట.తినే బల్ల బొంగురం లెక్క ముద్దుగున్నది. దాని మీద కంటికింపుగ బువ్వ గిన్నె, చియ్య కూర, పచ్చిపుల్సు కటోర సూసి ముర్సిపోయిన.ఊకనే మందలిచ్చి పోతనని వచ్చినరా. కానియ్యుండ్లి. మల్ల వత్త అని ఎన్కకు తిరిగిన.ఇంట్లకచ్చి నా తట్టు కుర్సిల నడుం వాల్చిన. రాంబాయి తిన్నట్టున్నది..! కొసకొంగు తోటి మూతి తుడ్సుకుంట ఈవలకచ్చింది. 'యాడికి పోయినౌ.. మాయిల్లమే వత్తివీ' అన్కుంట నాలికె కొస నుంచి జారిన రెండు మాటలు నా మీదకు ఇసిరేసి, తను పండుకునే కమ్రలకు పోతాంది.'యాడికి లేదు..' చిర్ర బుర్రి లేపి కొట్టినట్టు జవాబిచ్చిన..ఇద్దరం కల్సి కమస్కం తిండి సుత తింట లేము. తనకు వండుకోక తప్పదుకన్క అందుల్నే పిడికెడు బియ్యం ఎక్కువ పోత్తాంది రాంబాయి. వడ్డిచ్చుడు సంగతి దేవునికెరుక. తను నా కంటే ముందే కానిత్తది. మిగిలిన బువ్వ కూర ఊర్సుకొని తినుడు నావంతు. 'ఇది ఎంత వరకు మంచి పద్ధతి..? అనే నా ఆలోసన సనాతన ఆచారమా..! లేక నా వజీఫా నతీజనా' అని మన్సు నీల్లల్లకెల్లి ఒడ్డు మీద పడ్డ చాప పిల్ల లెక్క గిల, గిల కొట్టుకుంటాంటది.ఇయ్యాల్ల కమల, ఆదిరెడ్డికి వడ్డిత్తాంటే నా పానమంత అల్లల్లాడింది. ఒక రకంగా నేనూ మొండోన్నే. బువ్వ వడ్డియ్యమని నేను అడగను. ఆమె ధర్మం గాదా..! అని భీస్మించుకుని కూకుంట. అడగందే అవ్వా బువ్వ పెట్టదనే సామెత నాకు సుతనా..! అని మైండులకు రాంగనే పెదవులు మీద సిన్నంగ నవ్వు మొల్సింది. కడ్పుల ఎలుకలు ఉర్కబట్టినై. ఎవలైనా వచ్చి వడ్డియ్యాలని కడుపు ఎదురి సూడదు కదా..! దాన్ని శాంతి సెయ్యాలని కుర్సిలకెల్లి లేసిన.

--- --- ---

ఆవ్వాల కమలకు పరీచ్చ. పొద్దుగాల ఏడు కావత్తాంది.నా పానమంత అగులు బుగులు కాబట్టింది. నా కొడుకు రాసేటప్పుడు సుత గింత జావ కారి పోలేదు. నా సూపు తాప, తాపకు గనారంమ్మీద వాలుతాంది. సెకన్ల ముల్లు కొట్టుకుంటానట్టు రొంబచ్చెల సుత్తెతోని కొట్టినట్టు సప్పుడు కాసాగింది. ప్లేట్ల రెండిడ్లీలు పెట్టుకున్న. దబ్బ, దబ్బ తిని కమల దగ్గరికి పోయి దైర్నం చెప్పాలనుకున్న. ఇడ్లి సిన్న తుకుడ సుంచి నోట్లె పెట్టుకోబోయిన.. కమల ఏడ్పు, పెడబొబ్బలు ఇనచ్చినై. సట్న ప్లేటు పక్కకు నూకి చెయ్యి కడుక్కోని ఉర్కిన. కమల ఏడుత్తాంటే..

ఆదిరెడ్డి ఊకోబెట్తాండు. నన్ను సూడంగనే ఆదిరెడ్డీ నా దగ్గరికచ్చి మెల్లంగ జరిగిన సంగతి చెప్పేటాల్లకు కట్టెసర్సుక పోయిన.కమల నాయ్న ఛాతి నొప్పి తోటి కాలం చేసిండట. ఆదిరెడ్డి పాలేరు పాపయ్య సావు కబరు మోసుకచ్చిండు.నేనే డీలా పడిపోతే ఫాయిదా లేదు. కమల చేత ఎట్లనన్న పరీచ్చ రాయించాలని, ఆమె గురి, బేకారై పోవద్దని అనుకున్న. ముందుగాల ఆదిరెడ్డికి ధైర్నం చెప్పి కమల కాడికి పోయిన. నన్ను చూడగానే కమల అప్పయ్యా అని నామీద పడి గుండె పగిలేటట్టు ఏడ్వబట్టింది. ఆమెను ఊకించుడు నా వశంగాకచ్చింది.'కమలా.. గిసోంటి టైంలనే ధైర్నంగా ఉండాలమ్మా.. ఇవన్నీ దేవుడు మనకు పెట్టే పరీచ్చలు తల్లీ.. ఇవి తట్టుకుంటనే మనం మన జీవత లచ్చాన్ని చేరుకుంటం.. ఇన్నాల్లూ సదివిన సదువు బేకారైతదిరా.. ఆదిరెడ్డి పడ్డ కట్టం బూడిద పాలు సేత్తవా.. నాత్రింబగల్లు సదివిన సదువు ఏటిపాలు సేత్తవా..! కమలా.. ధైర్నం తెచ్చుకోమ్మా. సదువుతోని నువ్వు పడ్డ యాతనంత యాదికి తెచ్చుకో.. నీ మీద నీ చెల్లెండ్లు, అవ్వ ఆధార పడ్డరు. ఇప్పుడు ఇంటికి నువ్వే పెద్దదిక్కువు. గడ్సిపోయిన కాలాన్ని మనం మల్ల ఎన్కకు తీస్క రావత్తదా..!' అని ఓదార్సిన. తోడెం సేపటికి కమల జరంత తమాయించుకున్నది.'నేను పాపయ్యతోని పోయి. దహనానికి అన్నీ ఏర్పాట్లు సేయించుత' అని నచ్చసెప్పిన. కమలతోని పరీచ్చ రాయించే పని ఆదిరెడ్డికప్పగించి వాల్ల ఊరికి పయానమైన. తొవ్వపొంటి పాపయ్య, ఆదిరెడ్డి ఇంటి కత చెప్పబట్టిండు. ఆదిరెడ్డి వాల్లు నలుగురన్నదమ్ములు. ఇతను అందరికంటే చిన్నోడు. చిన్నతనంలనే తండ్రిని పోగొట్టుకున్నడు. ఆదిరెడ్డి అన్నలు ఎవరూ సదువుకోలేదు.. అంతా వ్యవసం సేసుకుంటనే బతుకుతాండ్లు.ఆదిరెడ్డిని బగ్గ సదివియ్యాలని వాల్ల తల్లి పట్టుపట్టెటాల్లకు పట్నంలో వుంచి సదివిత్తాండ్లు. ఆదిరెడ్డి ఊల్లె జాయిజాతు పంచాయితీలు ఎక్కువ. వీల్ల కుటుంబానికి సుత వాల్ల పాలోల్లు అన్నాలం సేసిండ్లు. అందరి నాయం కోసరం కొట్లాడాలంటే వకీలు కావాలని ఆదిరెడ్డి ఆలోసన. ఇంతల కమల కట్టాలు అతన్ని కదిలిచ్చినై. కమలకు ఒక దారి సూయించాలె అనే తపన వాల్ల జోడు బతుక్కు దారి తీసింది.అయితే మన కులం కాని కులం పిల్లను చేర దీసిండని ఎంత చెప్పినా వింట లేడని అన్నలంతా కూడబలుక్కున్నరు. ఆదిరెడ్డిని ఏరు పడేద్దామని తల్లి చెవుల్ల జోరీగలై సొచ్చిండ్లు. దాంతోటి ఆదిరెడ్డి తల్లి మానాది పెట్టుకొని మంచాల పడ్డది. కొన్నాల్లకు దేవుడు ఆమెను పైకి తీస్కపోయిండు. తల్లి కర్మకాండలు అట్ల ఐనవో.. లేవో..! ఇట్ల ఆస్తులు పంచుకుని ఆదిరెడ్డిని ఏరుపడేసిండ్లు.నా మన్సంతా కలికలైంది. కమల, ఆదిరెడ్డి జోడు బతుకు కాన్యాబ్ కావాలని దేవునికి మొక్కుకున్న.దహన సంస్కారానికి ఏర్పాట్లన్నీ పూర్తైనై. ఆదిరెడ్డి, కమల వచ్చేటాల్లకు పురంగ పొద్దుగూకింది.ఆదిరెడ్డి చితికి నిప్పు పెట్టిండు. అతని తాలూకు వాల్ల ఆనవాలు కానరాలేదు.

--- --- ---

కమలకు డాకుటారి సదివే సీటచ్చింది. అందరికంటే ఎక్కువ నేనే సంబురపడ్డ. మా ఇల్లు ఖాలీ చేసి పోతాంటే నాకు దుఃఖమాగింది కాదు. నా బిడ్డకు పెండ్లి సేసి అత్తగారింటికి పంపెటప్పుడు సుత నాకంత బెగడు సొర్రలేదు. కమల పోవుకుంట నా చేతులు పట్టుకొని తన కండ్లకద్దుకున్నది. మల్ల ఇన్నాల్లకు నా చేతులల్ల కమల..'నమస్తే.. అంకుల్..' అన్కుంట ఆదిరెడ్డి వచ్చేటాల్లకు తెప్పరిల్లిన. అతని ఎన్కాలనే వాల్ల బిడ్డ. ఆదిరెడ్డి రూపు రేఖలు అద్దుకొని సూడ సక్కంగున్నది. 'మా బిడ్డ బిందు' అనంగనే బిందు తన చిట్టి చేతులు

జోడిచ్చి దండం పెట్టింది.'బిందూ.. తాతయ్యకు మంచి నీల్లు తీసుకురామ్మా. అట్లనే చాయే సుత తీస్కరా' అన్నది కమల. 'ఆదిరెడ్డి అసోంటోల్లు ఈ లోకంల ఉండరప్పయ్యా.. మా కుటుంబ భారమంతా మోసిండు. మా నాయ్న నౌకరి మా అవ్వకు వచ్చేదాక ఆఫీసుల సుట్టు తిరిగిండు. నా చెల్లెండ్ల పెండ్లిల్లు ముందుపడి సేసిండు' అన్కుంట కమల చెప్తాంటే..'కమలా.. అది నా బాద్దెత. నువ్వు నా దానివైనప్పుడు నీ వాల్లంత నావాల్లు కాదా.. ఇందుల నా గొప్పదన మేమున్నది. ఐనా నీ సాకారం లేందే ఇదంతా జరిగిందా..!' అన్నడు ఆదిరెడ్డి మెప్పుకోలుగ.ఆదిరెడ్డికి చేతులెత్తి మొక్కిన.'వద్దు అప్పయ్యా.. మమ్ముల్ని ఆశీర్వదించాల్సిన చేతులు మీయి. మీరు ఆదినం ఇల్లు కిరాయకిచ్చి సంత బిడ్డ లెక్క సూసుకున్నరు. మాబతుకులు నిలబడ్డయి.

'అప్పయ్యా.. చిన్నమ్మ బాగున్నదా?' అని మాట మార్సుకుంట అడిగింది కమల. మీ చిన్నమ్మ బాగానే వుందమ్మా..' అన్కుంట బిందు తెచ్చిన నీల్ల గిలాస అందుకున్న. బిందు చాయె కోసరం మల్ల లోపలికి పోయింది. కొన్ని నీళ్ళు తాగి గిలాస కింద పెట్టుకుంట ఒక ఖాస్ సలహా ఇద్దామని వచ్చిన అని 'సల్లకచ్చి ముంత దాసుడెందుక'న్నట్టు అసలు సంగతి తీసిన. ఆదిరెడ్డి, కమల ఒకల మొకమొకలు ఇచ్చంత్రంగ సూసుకోసాగిండ్లు. ఏందో ఆ ఖాస్ కబర్ అన్నట్టు.

'ఇన్నాల్లూ మీరు కలిసి, మెలిసి సూడ ముచ్చటగ బతికిండ్లు. అది మీ బతుకు తొలిదశ. శాన సంతోషం. ఇక ముందు గిట్లనే మలిదశల సుత కొనసాగియ్యాలని కోరుకుంటాన' సమఝ్ గానట్టు ఇద్దరు నా దిక్కు బీర్పోయి సూడబట్టిండ్లు.'మనం నిత్తె వార్తలల్ల సూత్తనే ఉన్నం. శానా మంది ఆలుమొగలు తొలిదశ బతుకు లెక్క మలిదశల బతుకు కొనసాగిత్త లేరు. నడి వయసోల్లు పేరుకు మాత్రం ఆలుమొగలే గాని జోడు బతుకు సాగిత్తాండ్లు. వాల్ల బతుకు తొలిదశల ఉన్న ముద్దూ ముచ్చట్లు మలిదశల ఉంట లేవు' అంటాంటే నా సరం తప్పింది. గిలాసల మిగిలిన నీళ్ళు తాగి సరాయించుకున్న. 'మీ జోడు బతుకును, ఆలుమొగలుగ మల్సుకున్నరు. ఆలుమొగల బతుకు అంటే ఆడ, మొగ కల్సుకొనుడు ప్రధానం కాదు. అనురాగమయమైన బతుకు.. ఆనందదాయకమైన బతుకు. మున్ముందు ఎంత వయసచ్చినా ఆ ముద్దూ ముచ్చట బతుకుల్ల ఫరక్ రావద్దు' అంటాంటే నా కండ్లల్ల సన్నంగ నీల్లూరినై. జరంత సేపు ఆగి, కండ్లు ఒత్తుకొని మల్ల చెప్పసాగిన.'నేనూ ఆదిరెడ్డి లెక్కనే నా రాంబాయి కోసరం శాన కట్టబడ్డ. మా పెండ్లి నాటికి ఆమె పదవ తరగతి తప్పింది. ఆడది వంటిటి కుందేలు కావద్దని సయంగ టూచన్ సెప్పిన. కోచింగిప్పించి డిగ్రీ చేయించిన. నసీబ్ కులాయించి టీచరు నౌకరచ్చింది. ఇప్పుడు వజీఫకు దగ్గర్ల పడ్డది. పిల్లలిద్దరికీ పెండ్లిల్లు సేసినం. ఇక మేము ఏ రందీ రవుసు లేకుంట హాయిగా బతకాల్సినోల్లం. కాని మా సందుల మునుపటి పేమలు కరువైనై. కీసులాటలు మొదలైనై. 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్టు జోడు బతుకు కొనసాగిత్తానం. మీరు మా అసోంటి దుర్గతి తెచ్చుకోవద్దని చెప్పడానికే ఇంత దూరం వచ్చిన' అంటాంటే నా కండ్లు నీల్ల కాల్వలైనై. దస్తీ తీసి తుడ్సుకోబోతాంటే.. ఎదురుంగ మసక మసగ్గ రాంబాయి కనబడ్డది. నా కండ్లను నేనే నమ్మలేక పోయిన. కండ్లు మరింత గట్టిగ తుడ్సుకొని బీర్పోయి సూడసాగిన.

రాంబాయి వంటింట్ల కెల్లి చాయె కోపులు తీస్కోని వత్తాంది. ఆమె మొకంల పచ్తాన కనబడ్తాంది.. నామొకమే ఆమె మొకంల అద్దంలెక్క కనబడ్తాందనుకుంట.'అప్పయ్యా.. చిన్నమ్మ సుత మా మలిదశ బతుకు బండలు సేసుకోవద్దని సెప్పడానికే వచ్చింది' అన్కుంట ఆదిరెడ్డి దిక్కు సూసింది. ఆదిరెడ్డి కానిమ్మన్నట్లు కండ్ల తోటి సైగ సేసిండు. 'చిన్నమ్మ మాట గరకు గాని మన్సు సున్నితం అప్పయ్యా. మేము ఆనాడే మీ మలిదశ

బతుకు కూనంబట్టినం. అప్పుడు మీకు సెప్పే వయసు కాదు నాది. ఇప్పుడొక డాకుటారమ్మగా మీకు సలహా ఇవ్వడం నా ధర్మం' అన్కుంట రాంబాయినీ, నన్నూ ఓ పాలి సూసి మల్ల చెప్పబట్టింది.'అప్పయ్యా.. ఆడామె బైటుండుడు ఆగి పోంగనే ఆమె మైండుల సహజంగా కొంచెం మార్పత్తది. ఆ దశలో మొగడు, పిల్లలు తన మాట దాటద్దని మంకు పెరుగుతది. తన తల్లిగారింటోల్ల మీద మాట పడితే ఓర్సుకోదు. వజీఫా అయిన తర్వాత మునుపటి లెక్క సకల సౌకర్యాలు అందిత్త లేదని.. తన మాటకు విలువిత్త లేదని ప్రతీ మగవాడు మొకం మాడ్సుకుంటాంటడు. ఇద్దరూ పంతాలకు, పట్టింపులకు పోయి లోపల, లోపలన బాధ పడతరే తప్ప మనసు విప్పి మాట్లాడుకోరు. ఇదివరకటి లెక్క సదురుకపోరు.అప్పయ్యా.. ఖాస్గ నేను సెప్పేదేంటంటే ఆలుమొగలు ఒకనొకలు సెమాపణల కోసరం మన్సుల కచ్చ పెట్టుకోవద్దు. కల్సి, మెల్సి మసులుకుంటే.. మనుగడ ఏదశలో అయినా విరబూసిన మల్లెల పూదోటైతది' అని గీతోపదేశం సేసింది కమల. కమల మాటలు అచ్చర సత్తెమనిపిచ్చింది. లేసి రాంబాయి దిక్కు దీనంగ సూసిన. ఆమె కండ్లు కన్నీటి కడవలైనై. ఇద్దరం ఎదురుబదురుగ కదిలినం. మా అడుగులు పెండ్లైన కొత్తల తడబడ్డట్టు తడబడ్డానై.

(నమస్తే తెలంగాణ 'బతుకమ్మ' ఆదివారం సంచిక తేది: 19 ఏప్రిల్ 2020)

**చెన్నూరి సుదర్శన్, సెల్: 944055 8748**